సాక్షి
మెదక్

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023



కాయ్ రాజా.. కాయ్!

దుబ్బాక నియోజకవర్గంలో ఎవరు విజయం సాధిస్తారనే దానిపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. వివరాలు 8లో ▸



తగ్గిన దిగుబడి...

ఈ ఏడు పత్తి పండించిన కొల్చారం మండల రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. వివరాలు 9లో ▸



వైభవంగా శివపార్వతుల కల్యాణం

రేగోడ్‌లోని గోకర్ణేశ్వర శివాలయంలో శివ పార్వతుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

జిల్లాలో144 సెక్షన్ అమలు

జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని



మెదక్ మున్సిపాలిటీ: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని మెదక్, నర్సాపూర్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల కౌంటింగ్ హవేళిఘణాపూర్ మండల కేంద్రంలోని వైపీఆర్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడ వద్దని హెచ్చరించారు. అలాగు టపాసులు కాల్చడం నిషేధించినట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రాంతం వద్ద 'పోలీస్ పికెట్' ఏర్పాటు చేశామని రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డు ఉంటేనే ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు, అగ్గిపెట్టెలు, లైటర్ల వంటి నిషేధిత వస్తువులను కౌంటింగ్ హాల్లోకి తీసుకెళ్లడానికి అనుమతి లేదన్నారు. గెలుపొందిన అభ్యర్థులు ఆదివారం తమ విజయోత్సవ ర్యాలీలు జరపడం నిషేధించామని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆన్ జాబ్ శిక్షణతో ఉజ్వల భవిష్యత్తు



శిక్షణ తీరును పరిశీలిస్తున్న జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ

రామాయంపేట(మెదక్): విద్యార్థులకు ఆన్ జాబ్ శిక్షణతో ఉజ్వల భవిష్యత్తు ఉందని జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ అన్నారు. పలు బ్యాంకులతో పాటు మోటర్ వైండింగ్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల వొకేషనల్ కోర్సు విద్యార్థులు పొందుతున్న శిక్షణ తీరును శనివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ శిక్షణతో స్వయం ఉపాధితోపాటు మెరుగైన ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, వొకేషనల్ విభాగం అధ్యాపకులు బాలప్రకాశ్, ఇతర లెక్చరర్లు, బ్యాంక్ అధికారులు ఉన్నారు.

రాంపూర్ వాసికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న వెంకటేశ్వర్లు

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన బందారం వెంకటేశ్వర్లు డాక్టరేట్ పట్టా పొందారు. ఉస్మానియా వర్సిటీలో తత్వశాస్త్ర విభాగంలో పనిచేస్తున్నారు. 'ది ఆరిజిన్ అండ్ ఇవాల్యుయేషన్ ఆఫ్ యోగ' అనే అంశంపై పరిశోధన చేశారు. నిపుణుల కమిటీ అతడి పరిశోధన గ్రంథాన్ని పరిశీలించి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) పట్టాకు సిఫారసు చేసింది. దీంతో శనివారం ఆయన డాక్టరేట్ అందుకున్నారు. గ్రామం నుంచి డాక్టరేట్ పొందిన రెండో వ్యక్తి వెంకటేశ్వర్లు.

పిల్లలపై శ్రద్ధ చూపాలి



విద్యార్థులతో హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సంగారెడ్డిలోని సబిత దివ్యాంగుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అన్ని రకాల సేవలు అందించాలని, సరైన మార్గంలో ఉండేటట్లు చూడాలని అక్కడున్న సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సబిత దివ్యాంగుల పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల డబ్బులు ఇవ్వాలి

అధికారులకు ఆశావర్కర్ల వినతి

జహీరాబాద్ టౌన్: ఎన్నికల విధులను నిర్వహించిన తమకు డబ్బులు ఇవ్వాలని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ నాయకులతో కలిసి డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయ అధికారి రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ.. ఎన్నికల విధులు నిర్వహించిన ఆశావర్కర్లకు డబ్బులు ఇవ్వకపోవడం సరికాదన్నారు.

తీర్పు నేడే..





- తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- అనుచరులతో నేతల సమాలోచనలు
- జిల్లాలో జోరుగా పందేలు
- అందరి చూపు 'మెదక్' వైపు

ఎన్నికలకు సంబంధించి ఓటరు తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఎవరిని అసెంబ్లీకి పంపుతారో? ఎవరిని ప్రతిపక్షంలో కూర్చోపెడతారో? మరికొన్ని గంటల్లో తేలనుంది. నవంబర్ 30న పోలింగ్ పూర్తవ్వగా ఈ ఓట్ల లెక్కింపు ఆదివారం జరుగనుంది. అయితే ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఎవరికి వారు ఓటరు దేవుళ్ల తీర్పు కోసం ఎదురు చూస్తున్నారు.

మెదక్: 2018 ఎన్నిలతో పోలిస్తే ఓటర్లు పెరిగినా పోలింగ్ శాతం తగ్గింది. ఈ నేపథ్యంలో తగ్గిన పోలింగ్ ఎవరికి లాభం చేకూర్చనుంది, ఎవరికి నష్టం కలిగే అవకాశం ఉందని, లెక్కల్లో నిమగ్నమయ్యారు. మరోవైపు గెలుపోటములు, విజేతల మెజార్టీపై జిల్లా వ్యాప్తంగా లక్షల్లో పందేలు కాస్తుండగా రాష్ట్రంలో అందరి చూపు మెదక్ నియోజకవర్గం పైనే ఉంది. చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి నెలన్నర పాటు గెలుపు కోసం హోరాహోరీగా పోరాడిన అభ్యర్థులు ఇప్పుడు ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు.

జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థుల్లో కొందరు గెలుపు తమదేనంటూ ధీమా వ్యక్తం చేస్తుండగా, మరికొందరు ఫలితాలపై పార్టీ శ్రేణులతో పాటు ఇతరులతో చర్చిస్తున్నారు. మండలాలు, గ్రామాల వారిగా పోలింగ్ సరళి గురించి చర్చిస్తూ లెక్కలు తెప్పించుకుని రెండు రోజులుగా కూడికలు, తీసివేతల్లో నిమగ్నమయ్యారు. అలాగే పోలింగ్ ఏజెంట్లుగా వ్యవహరించిన వారితో ఓటర్ నాడి ఎటువైపు ఉందని ఆరాతీశారు.

కాస్త విరామం

ఎన్నికల్లో క్షణం తీరిక లేకుండా ప్రచారంలో మునిగిన అభ్యర్థులు రెండు రోజుల పాటు విరామం దొరకడంతో తమ కుటుంబ సభ్యులతో గడిపారు. మరికొందరు ఇళ్లకు పరిమితం కాగా ఇంకొందరు వారికి ఇష్టమైన ప్రదేశాలకు వెళ్లి సరదాగా గడిపినట్లు సమాచారం. మరి కొందరు ఆదివారం వెలువడే ఫలితాలపై ఆరా తీస్తూ పోలింగ్ సరళిపై లెక్కలు కడుతున్నారు.

అందరి దృష్టి మెదక్ వైపు

అందరి దృష్టి మెదక్ వైపునే ఉంది. బీఆర్ఎస్ పార్టీ మెదక్ టికెట్‌ను తన కొడుకు రోహిత్‌రావుకు ఆశించి భంగపడిన మైనంపల్లి హన్మంతరావు మంత్రి హరీశ్‌రావుపై తీవ్ర పదజాలంతో విమర్శించి సంచలన సృష్టించారు. ఆయన బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ నుంచి తనతో పాటు తన కొడుకుకు రెండు టికెట్లు కైవసం చేసుకుని రాష్ట్రంలోనే ప్రత్యేక నేతగా మైనంపల్లి వార్తల్లో కెక్కారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్, మల్కాజ్‌గిరిలో మైనంపల్లి తండ్రీకొడుకుల గెలుపోటములపై చర్చలు జోరుగా సాగుతున్నాయి.

పందేల జోరు

ఈ ఎన్నికల్లో జయాపజయాలపై భారీ స్థాయిలో పందేలు కొనసాగుతున్నాయి. మెదక్, నర్సాపూర్ బరిలో ఉన్న ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులపై బెట్టింగ్‌లు కడుతున్నారు. పోలింగ్ పక్రియ ముగిసిన నాటి నుంచి పందేల జోరు పెరిగినట్టు సమాచారం. మెదక్, నర్సాపూర్‌లలో ఎవరు గెలుస్తారు, మెజార్టీ ఏ మేరకు వస్తుంది, ఏ పార్టీ అధికారంలోకి రాబోతుందనే అంశాలపై లక్షలలో బెట్టింగులు జరుగుతున్నట్టు తెలుస్తోంది.

ఎవరి అంచనాలు వారివి

చిన్నశంకరంపేట(మెదక్): శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తికావడంతో అభ్యర్థులు ఫలితం కోసం ఎదురు చూస్తున్నారు. ఎవరికి వారే తమకు లీడ్ వస్తుందని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక బీజేపీ నాయకులు ఎన్నికల ఫలితంపై ఇప్పటికే డీలా పడ్డట్టు కన్పిస్తున్నారు. మెదక్ నియోజవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావు, బీజేపీ అభ్యర్థి పంజా విజయ్ మధ్య ప్రధానంగా పోటీ కొనసాగింది. అయితే మైనంపల్లి రోహిత్‌రావు గ్రామం కొర్విపల్లి కావడంతో భారీగా ఓట్లు రాబట్టామని కాంగ్రెస్ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు సైతం తమకే లీడ్ వస్తుందని భావిస్తున్నారు. మండలంలోని 29 పంచాయతీల పరిధిలో 40 పోలింగ్ కేంద్రాలలో 30,375 ఓట్లు ఉండగా 26,972 ఓట్లు పోలయ్యాయి. నార్సింగి మండలంలోని 4 పంచాయతీల పరిధిలోని 6 పోలింగ్ కేంద్రాలలో 5,200 ఓట్లకు గాను 4,442 ఓట్లు పోలయ్యాయి. మండలంలో 26,972 ఓట్లలో పురుషులు 13,269 ఓట్లు వేయగా, మహిళలు 13,703 ఓట్లు వేశారు. ప్రధానంగా పోల్ మేనేజ్మెంట్ ప్రభావం మహిళ ఓటర్లపై పడి ఉంటుందని ఎవరికి లాభం కల్గిస్తుందని చర్చనీయంశంగా మారింది. మహిళ ఓటర్లకు తోడు యువత ఓట్లు కీలకంగా మారనున్నాయి. నువ్వా నేనా అనే తీరులో జరిగిన ఎన్నికల ఫలితం తేలే వరకు నాయకులకు తీవ్ర ఉత్కంఠ తప్పదు. దానికి ఆదివారం తెరపడనుంది.

విజయంపై ఈటల ధీమా

- బీజేపీ గెలుపుపై ఆరా
- తూప్రాన్, మనోహరాబాద్ నాయకులతో చర్చలు



రాజేందర్‌ను కలిసిన తూప్రాన్, మనోహరాబాద్ బీజేపీ నాయకులు

తూప్రాన్: గజ్వేల్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం తన నివాసంలో తూప్రాన్ బీజేపీ నాయకులతో ఏ గ్రామంలో ఎంత మెజార్టీ వస్తుంది, తూప్రాన్ మున్సిపాలిటీలో మనకు ఎంత మెజార్టీ వస్తుందని మున్సిపల్ శాఖ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ముఖ్య నాయకులు విఠల్, మురళి దుర్గరాజ్ యాదవ్‌లతో మండలంలోని పరిస్థితులను, ఏయే గ్రామాల్లో ఎంత మెజార్టీ వస్తుందని ఆరా తీసి గ్రామాల వారీగా వివరాలు తెలుసుకున్నారు. మనోహరాబాద్ మండలంలో భారీ మెజార్టీ వస్తుందని అజయ్‌కుమార్, ఐలయ్య యాదవ్ ఈటల రాజేందర్‌కు తెలిపారు.

గజ్వేల్‌లో బీజేపీ జెండా ఎగరడం ఖాయం

తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు



రామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

తూప్రాన్: గజ్వేల్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు, కాళ్లకల్ సర్పంచ్ నత్తి మల్లేశ్ అన్నారు. ఇస్లాంపూర్ స్వయంభు రామలింగేశ్వరుడి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేకత, మోదీ సంక్షేమ పాలన నచ్చిన వారు రాజేందర్ గెలుపు కోసం ఓట్లు వేశారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ముదిరాజ్ రాష్ట్ర కన్వీనర్ పిట్ల సాయిబాబా, గజ్వేల్ నియోజకవర్గం జేఏసీ వైస్ చైర్మన్, నాయకులు నర్సింలు, రమేశ్, అనిల్ కుమార్, అరుణ్, గోపి పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

- మొత్తం 894 మంది రైతులు
- 1,28,711 బస్తాల సేకరణ



లారీలో లోడ్ అవుతున్న ధాన్యం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ఈ సారి రికార్డ్ స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. రైతులు పండించిన పంటను సంఘం ద్వారా కొనుగోలు చేసేందుకు ఆయా గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం వరకు 894 మంది రైతుల నుంచి 1,28,711 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇంకా అక్కడక్కడా కొద్దిపాటిగా సన్నధాన్యం కొనుగోలు చేయవలసి ఉంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి ఎప్పటి కప్పుడు తమ ఖాతాల్లో డబ్బులు పడేలా సంఘం సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. దీంతో తూకంలో ఆలస్యం, ధాన్యాన్ని రవాణా చేయడంలో ఇబ్బందులు కనిపించలేదు. దీంతో ఇక ముందు కూడా ఇదే విధంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన చర్యలు

- వైపీఆర్ కళాశాలలో ఏర్పాట్లు
- ప్రశాంత వాతావరణంలో లెక్కింపు
- సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ
- కేంద్రం వద్ద సాయుధ బలగాల పహారా
- జిల్లా కలెక్టర్ రాజార్షిషా



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్

హవేళిఘణాపూర్(మెదక్): పోలింగ్ అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఓటింగ్ యంత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచామని జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా తెలిపారు. ఆదివారం హవేళి ఘణాపూర్ వైపీఆర్ కళాశాలలో జరుగుతున్న ఎన్నికల ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. మెదక్ నియోజకవర్గ పరిధిలోని కౌంటింగ్ ప్రక్రియ 274 పోలింగ్ కేంద్రాలకుగాను 14 టేబుల్స్ ఏర్పాటు చేసి 20 రౌండ్స్‌లలో ఓట్లు లెక్కించనున్నారు. ఆ ఫలితాలను రౌండ్‌ల వారీగా తెలియజేనున్నారు. అలాగే అదే భవనంలోని మరో హాలులో నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన 305 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లను ఏర్పాటుచేసి 22 రౌండ్లలో పూర్తి చేయనున్నారు. ఆయా సెగ్మెంట్ల నుంచి ఓట్ల లెక్కింపు కేంద్రమైన వైపీఆర్ కళాశాలకు ఈవీఎంలను తరలించి నిబంధనలకు అనుగుణంగా స్ట్రాంగ్ రూమ్‌లో అమర్చినట్లు ఆయన చెప్పారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసి, సాయుధ బలగాలతో పహారా ఏర్పాటు చేశారు. పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు సీసీ కెమెరాలను అమర్చి, మానిటర్ల ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి సోమవారం ఉదయం 6.00 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. కేంద్రాల్లోకి ఇతరులు వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టారు. ఆయన అన్ని ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే కౌంటింగ్ కేంద్రం వద్ద తాగునీరు, విద్యుత్ సరఫరా, కౌంటింగ్ టేబుల్స్, ఇతర ఏర్పాట్లను నిశితంగా పరిశీలించినట్టు చెప్పారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, రాజేశ్వర్, ఎన్నికల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అన్ని ఏర్పాట్లతో సిద్ధం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్

మెదక్ కలెక్టరేట్: అసెంబ్లీ నియోజకవర్గ సాధారణ ఎన్నికల్లో భాగంగా ఆదివారం నిర్వహించే ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి ఇతర అదనపు ఎన్నికల అధికారులతో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓట్ల లెక్కింపు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలో టేబుళ్లు, కౌంటర్లు, రాజకీయ పార్టీల ద్వారా నియమించిన ఏజెంట్లు, ఇతర ఏర్పాట్లను నిబంధనలకు లోబడి నిర్వహించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం రాజర్షిషా మాట్లాడుతూ ర్యాండం ప్రకారం వీవీ ప్యాట్లలోని స్లిప్పులు లెక్కింపు జరుగుతుందని, ఎన్నికల పరిశీలకుల సమక్షంలో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని చెప్పారు.

కలెక్టర్‌కు స్వీప్ అధికారుల సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న స్వీప్ అధికారులు

మెదక్ కలెక్టరేట్: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషాను స్వీప్ అధికారులు శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో ఘనంగా సన్మానించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి వివిధ రకాల అవగాహన కార్యక్రమాల ద్వారా ఎన్నికలల్లో అత్యధిక ఓటింగ్ నమోదుకు ఆయన ఎంతో కృషి చేశారని వారు ప్రశంసించారు. ఆయన కృషి వల్లే జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. జిల్లాలో 42 రోజుల ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ప్రతి కార్యక్రమంలో కలెక్టర్ ప్రత్యక్షంగా పాల్గొని విజయవంతం చేశారని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా స్వీప్ అధికారి బ్రహ్మాజీ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

దివ్యాంగుల కోసం ర్యాంపులు

జడ్జి మురళీమోహన్

సిద్దిపేట జోన్: దివ్యాంగులు ఆత్మ విశ్వాసంతో జీవించాలని జిల్లా ఒకటవ అదనపు జడ్జి మురళీమోహన్ సూచించారు. శనివారం ఎన్జీఓ భవన్‌లో జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు దివ్యాంగుల కోసం ప్రత్యేక చట్టాలు రూపొందించాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు, దేవస్థానాల్లో ర్యాంపులను ఏర్పాటు చేయాలని సూచించారు. వారిపై వివక్ష, దాడులు చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని వివరించారు. దివ్యాంగులకు ఏదైనా సమస్యలు వస్తే జిల్లా లీగల్ సెల్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి మిలింద్ కాంబ్లే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, డిఫెన్స్ కౌన్సిల్ ప్రతినిధులు శ్రీకర్ రెడ్డి, వెంకటేశ్, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి అవార్డుల పంట

- జహీరాబాద్ ఏరియా ప్రభుత్వాస్పత్రికి 'ముస్కాన్' అవార్డు
- ప్రతీఏటా రూ.10 లక్షలు అందజేత
- మూడేళ్లపాటు నిధులు విడుదల
- ఏడాదిలోపే నాలుగు జాతీయ పురస్కారాలు
- వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలకు గుర్తింపు

జహీరాబాద్ ఏరియా ప్రభుత్వాస్పత్రికి అవార్డుల పంట పండుతూనే ఉంది. రోగులకు అందుతున్న ఉత్తమ వైద్యసేవలకు గాను ఏడాదిలోపు నాలుగు పురస్కారాలను అందుకుంది. తాజాగా కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ అందించే 'ముస్కాన్' అవార్డుకు జహీరాబాద్ ఆస్పత్రి ఎంపికైంది. ఈ విషయాన్ని జాతీయ ఆరోగ్య మిషన్ శుక్రవారం వెల్లడించింది. ఈ అవార్డు కింద ప్రతీ ఏటా రూ.9 లక్షల చొప్పున మూడేళ్లపాటు అందించనున్నారు. – జహీరాబాద్:

జహీరాబాద్ ఏరియా ప్రభుత్వాస్పత్రిలో నవజాత శిశువులకు మెరుగైన వైద్యసేవలు అందించడం, శిశు మరణాలను తగ్గించడం, సేవల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం, వైద్యులు అందిస్తున్న సేవలపై అక్టోబర్ 7, 8వ తేదీల్లో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్(ఎన్‌క్వాస్) కేంద్ర అధికారుల బృందం ఆస్పత్రిని సందర్శించింది. 87 శాతం మార్కులతో ముస్కాన్ అవార్డు లభించింది.



అవార్డులను చూపుతున్న వైద్యులు

ఈ ఏడాదిలోనే మూడు అవార్డులు..

ఇదిలా ఉంటే అత్యవసర వైద్య సేవలు అందించడం, ఆపరేషన్లు నిర్వహించడం, లేబర్ రూం నిర్వహణ, వైద్యులు అందిస్తున్న సేవలు, వారు నిర్వహిస్తున్న విధులు, ఫైర్ అలర్ట్, సెక్యూరిటీ సేవలను పరిశీలించి అక్టోబర్‌లో 'ఎన్‌క్వాస్' అవార్డును ప్రకటించింది. ఈ అవార్డు కింద రూ.10 లక్షల పురస్కారం ప్రకటించింది. మూడు సంవత్సరాల పాటు ఈ నగదును ప్రభుత్వం ఆస్పత్రికి అందించనుంది. ఈ ఏడాది జనవరిలో కేంద్ర బృందం పర్యటించి ఆస్పత్రి నిర్వహణను పరిశీలించి 'లక్ష్య' అవార్డును ప్రకటించింది. ఈ పురస్కారం కింద ఆస్పత్రికి ప్రతీ ఏటా రూ.6లక్షల నిధులను అందిస్తోంది. మూడేళ్ల పాటు ఇవ్వనున్నారు. మే నెలలో ఆస్పత్రికి 'బ్రెస్ట్ ఫీడింగ్' అవార్డు వచ్చింది. తల్లి పాల ప్రాముఖ్యతకు గుర్తింపు, సాధారణ ప్రసవాల్లో రాష్ట్రంలోనే టాప్‌లో నిలవడం, అన్ని వైద్య సేవలు అందించడంలో మన్ననలు పొందుతున్న జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది.



జహీరాబాద్ ఏరియా ప్రభుత్వాస్పత్రి

సమష్టి కృషితో ..

ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది సమష్టి కృషితో అందిస్తున్న సేవలను గుర్తించి ఈ మేరకు జాతీయ స్థాయి అవార్డులు వచ్చినట్లు ఆస్పత్రి వైద్యులు శ్రీధర్, శేషరావు తదితరులు శనివారం ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరించారు.

క్లుప్తంగా

పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ అప్పగింత



సురేఖకు ల్యాప్‌టాప్ అందజేస్తున్న కండక్టర్

నారాయణఖేడ్: జహీరాబాద్‌కు వెళ్తున్న నారాయణఖేడ్ డిపోకు సంబంధించిన ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికురాలు తన ల్యాప్‌టాప్‌ను మరిచిపోయింది. ప్రయాణికులంతా దిగిపోయాక కండక్టర్ జానాబాయి దానిని గుర్తించి.. అక్కడి డిపో సెక్యూరిటీ హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ, ఆఫీస్ సూపరింటెండెంట్ చందుపల్లకు అప్పగించారు. ల్యాప్‌టాప్‌ను మరిచిపోయిన ఉపాధ్యాయురాలు సురేఖ బస్టాండ్‌కు తిరిగి వచ్చారు. కండక్టరు ల్యాప్‌టాప్‌ను ఆమెకు అప్పగించారు. విషయం తెలుసుకుని ఆర్‌ఎం ప్రభులత, డిప్యూటీ ఆర్‌ఎం దైవాధీనం, ఖేడ్ డీఎం మల్లేశయ్య కండక్టర్‌ను అభినందించారు.

మల్లన్న సేవలో మాజీ డీజీపీ



మల్లన్న సన్నిధిలో మాజీ డీజీపీ దినేష్ రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామిని మాజీ డీజీపీ దినేష్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్‌ఐ నాగరాజు, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్ పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



శిశువును చూపుతున్న సిబ్బంది

ములుగు(గజ్వేల్): డెలివరీ కోసం గర్భిణిని గజ్వేల్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా 108 అంబులెన్స్‌లోనే ప్రసవమై పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. ములుగు మండలం ఒంటిమామిడి కోళ్లఫారంలో పనిచేసే నిండుగర్భిణి రోహిణి(25)కి శుక్రవారం రాత్రి పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో ములుగు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో ఈఎంటీ రమేష్ బృందం అక్కడకు చేరుకున్నారు. ఆమెను అంబులెన్స్‌లో గజ్వేల్ ఆస్పత్రికి తరలిస్తుండగా గౌరారం వద్ద నొప్పులు అధికమయ్యాయి. సిబ్బంది డెలివరీ చేయడంతో ఆమె మగశిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలన

ఇబ్రహీంపట్నం రూరల్: మంగళ్‌పల్లి సమీపంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని శనివారం రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ మహేశ్వరం జోన్ డీసీపీ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. అధికారులతో మాట్లాడి ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరిగేలా చూడాలని అన్నారు. ఏజెంట్లు, పోలీసులు, అధికారులకు ప్రత్యేక ప్రవేశం కల్పించడం జరిగిందన్నారు.ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేలా అందరూ సహకరించాలని కోరారు.

కాయ్ రాజా..కాయ్!





- దుబ్బాక ఫలితాలపై జోరుగా బెట్టింగ్‌లు
- రూ.10 వేల నుంచి 50 లక్షల వరకు పందేలు
- గెలుపుపై ప్రధాన పార్టీల అభ్యర్థుల ధీమా

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గంలో ఎవరు విజయం సాధిస్తారనే దానిపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఎక్కడ నలుగురు కలిసినా ఎన్నికల ఫలితాల పైనే చర్చించుకోవడం కనిపిస్తుంది. నియోజకవర్గంలో ఈ సారి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు, కాంగ్రెస్ అభ్యర్థి మాజీ మంత్రి ముత్యంరెడ్డి తనయుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మధ్య నువ్వా..నేనా..? అనే విధంగా ట్రయాంగిల్ పోటీ జరిగింది. వీరు గెలుపు కోసం సర్వ శక్తులు ఒడ్డారు. ప్రచారం సైతం పోటాపోటీగా నిర్వహించారు. ప్రచారంలోనే కొత్త ప్రభాకర్‌రెడ్డి కత్తి పోటుకు గురై 15 రోజులకు పైగా ఆస్పత్రిలోనే ఉన్నారు. ఆయన కుటుంబ సభ్యులే ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో ఈ సారి మొత్తం 198,100 ఓట్లకు గాను 1,73,366 ఓట్లు పోల్ అయ్యాయి. రికార్డు స్థాయిలో 87.51 శాతం పోలింగ్ నమోదైంది. భారీగా పెరిగిన ఓటింగ్ శాతం తమకే అనుకూలం అంటూ ప్రధాన పార్టీలు ఎవరికే వారే లెక్కలేసుకుంటున్నారు.

బెట్టింగ్‌ల జోరు

దుబ్బాక నియోజకవర్గం ఫలితంపై జోరుగా బెట్టింగులు కాసినట్లు విశ్వసనీయంగా సమాచారం. రూ.10 వేల నుంచి మొదలు పెడితే రూ.50 లక్షల వరకు బెట్టింగులు పెట్టినట్లు తెలిసింది. ప్రధానంగా బీఆర్‌ఎస్ -బీజేపీ అభ్యర్థుల గెలుపుపై ఎక్కువగా బెట్టింగులు కాసినట్లు సమాచారం. దుబ్బాక గెలుపుపై ఇక్కడే కాకుండా హైదరాబాద్ తోపాటు అమెరికా, ఆస్ట్రేలియా, దుబాయ్ తదితర దేశాల్లోని సెటిలర్స్ సైతం పెద్దఎత్తున బెట్టింగులు కాసినట్లు సమాచారం.

ఎవరి ధీమా వారిదే..

నియోజక వర్గంలో అధిక శాతం పోలింగ్ జరుగడంతో పక్కా 20 వేలకు పైగా మెజార్టీతో బీఆర్‌ఎస్ గెలుస్తుందని ఆ పార్టీ నాయకులు లెక్కలేసుకుంటున్నారు. బీజేపీ నాయకులు సైతం పోలింగ్ ఎక్కువగా ఉండటం మాకే లాభిస్తుందని, ప్రధానంగా ఈ సారి యూత్ కొత్త ఓటర్లు ఎక్కువగా తమకే ఓట్లు వేశారంటు మాట్లాడుకుంటున్నారు. కాంగ్రెస్ నాయకులు సైతం రాష్ట్రంలో సైలెంట్ ఓటింగ్ జరిగిందని, నియోజకవర్గంలో సైతం ఓటర్లు చెయ్యి గుర్తు వైపే మొగ్గు చూపారని చెబుతున్నారు. తామే గెలవాలంటూ ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు చేస్తున్నారు.

20 వేలకు పైగా మెజార్టీ..



నియోజకవర్గంలో ఓటర్లు తమకు అనుకూలంగా ఓట్లు వేశారు. జరిగిన పోలింగ్ సరళి, తమ అంచనాల ప్రకారం 20 వేలకు పైచిలుకు మెజార్టీతో తప్పకుండా విజయం సాధిస్తాం. బీజేపీ, కాంగ్రెస్‌లు ఎన్ని డ్రామాలు ఆడినా ఓటర్లు వారి కుట్రలను తిప్పిగొట్టి బీఆర్‌ఎస్‌కే అండగా నిలిచారు.

–బీఆర్‌ఎస్ అభ్యర్థి,ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

2 నుంచి 5 వేల మెజార్టీతో గెలుస్తున్నాం



దుబ్బాక ఎన్నికల ఫలితం కచ్చితంగా ఉప ఎన్నిక మాదిరిగా రిపీట్ అవుతుంది. 2 వేల నుంచి 5 వేల మెజార్టీతో బీజేపీ గెలుస్తుంది. ప్రజలు, ముఖ్యంగా యూత్, నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యావంతులు, రైతులు, మహిళలు కమలం గుర్తుకే ఓటు వేశారు.

–బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు

స్వల్ప మెజార్టీతో గెలుస్తాం



దుబ్బాకలో స్వల్ప మెజార్టీతో కాంగ్రెస్ జెండా ఎగురుతుంది. నియోజక వర్గంలో సైలెంట్ ఓటింగ్ జరిగింది. దీనిని బట్టి చూస్తే కచ్చితంగా కాంగ్రెస్ గెలుస్తుందనే నమ్మకం ఏర్పడింది. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం కలిసి వచ్చింది. తప్పకుండా విజయం సాధిస్తాం.

–కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

ప్రాజెక్టులతో విద్యార్థులకు మేలు



విద్యార్థులతో సుబ్బారావు తదితరులు

నర్సాపూర్: వినూత్న ప్రాజెక్టులతో విద్యార్థులకు మేలు జరుగుతుందని హైదరాబాద్‌లోని మహీంద్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ సుబ్బారావు తెలిపారు. శనివారం నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ డేను పురస్కరించుకుని స్థానిక బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ... వినూత్న ప్రాజెక్టులతో విద్యార్థులకు మేలు జరుగుతుందని, వాటిని చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్న కాలేజీ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. అనంతరం ఆయన కాలేజీలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగంలోని సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, మేనేజర్ బాపిరాజు, సివిల్ ఇంజనీరింగ్ విభాగం హెచ్‌ఓడీ కృష్ణారావు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆకలి కేకలు

- బిల్లు రాలేదని మధ్యాహ్న భోజనం బంద్
- రాయపోలు ప్రాథమిక పాఠశాలలో ఘటన



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న తల్లిదండ్రులు

రాయపోలు(దుబ్బాక): నాలుగు నెలలుగా బిల్లులు రావడం లేదని ఏజెన్సీ నిర్వాహకులు మధ్యాహ్న భోజన బంద్ చేశారు. దీంతో రెండు రోజులుగా ఆ పాఠశాల విద్యార్థులకు ఆకలి కేకలు పెడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. రాయపోలు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో వంటచేసే ఏజెన్సీ నిర్వాహకులకు నాలుగు నెలలుగా బిల్లులు రావడం లేదు. శుక్రవారం వంట చేసేందుకు మహిళలు పాఠశాలకు రాలేదు. దీంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనం లేక పస్తులున్నారు. ఉపాధ్యాయులు దీనిపై స్పందించకపోవడంతో శనివారం కూడా ఇదే పునరావృతమైంది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఉపాధ్యాయులను నిలదీశారు. ఇక్కడ వంట చేయడం లేదని తమకు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. విషయాన్ని ఇన్‌చార్జి తహసీల్దార్ నర్సమ్మ దృష్టికి తీసుకెళ్లగా.. విచారణకు క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డిని పంపించారు. ఆయన ఏజెన్సీ మహిళలతో మాట్లాడి బిల్లులు అందేలా చూస్తామని, వంట ప్రారంభించాలని కోరారు. సోమవారం నుంచి వంట చేస్తామని తెలిపారు.

అంబులెన్సు ఆకస్మిక తనిఖీ



అంబులెన్సును తనిఖీ చేస్తున్న అధికారి జనార్దన్

కొండపాక(గజ్వేల్): కొండపాక మండల 108 అంబులెన్స్‌ను శనివారం ఉమ్మడి మెదక్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్, జిల్లా కోఆర్డినేటర్ కుమారస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్సులో ఉన్న పరికరాలు పనితీరులను, అందుబాటులో ఉన్న మెడిసిన్ తీరులను అడిగి తెలుసుకున్నారు. సమాచారం అందిన ఎంత సేపటికీ సంఘటనా స్థలానికి అంబులెన్స్ చేరుకుంటుందన్న విషయమై రిజిస్టరును పరిశీలించారు. స్థానిక 108 అంబులెన్సు సిబ్బంది బాధితులకు అందించిన ఈఎంఆర్‌ఐ సేవల విషయమై గ్రీన్ హెల్త్ సర్వీస్ కోవిడ్ ఏషియన్ అవార్డును దక్కించుకోవడం పట్ల సిబ్బంది పనితీరును అభినందించారు. జపాన్‌లోని టోకియోలో అత్యవసర వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లో 108 అంబులెన్సు ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ ప్రదానోత్సవంలో అందజేశారు. కోవిడ్ వ్యాధి విజృంభణ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 25.3లక్షల మందికి అంబులెన్సు నుంచి సేవలందించడంతో గ్రీన్ హెల్త్ సర్వీస్ దక్కింది. కార్యక్రమంలో మెడికల్ టెక్నీషియన్లు హమేందర్, గణేష్, పైలెట్‌లు శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

జిన్నారం(పటాన్‌చెరు): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన ఘటన జిన్నారం మండలం వావిలాల గ్రామంలో శనివారం జరిగింది. ఎస్‌ఐ విజయారావు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చండి గ్రామానికి చెందిన లావణ్య అలియాస్ మాధవి(28)తో 11ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. రెండేళ్ల క్రితం మిరుదొడ్డిలో చంద్రశేఖర్ 2.10 ఎకరాల భూమిని కొనుగోలు చేసి భార్య పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాడు. ఆ భూమిని విక్రయంపై భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కాగా శనివారం మాధవి నోట్లో నుంచి నురగలు వచ్చి ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెంది ఉంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన బాషా

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన నార్సింగి మండల కేంద్రంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. తిప్పరోబోయిన నరేష్ అప్పటివరకు నార్సింగి జెడ్పీ పాఠశాల ఆవరణలో వాలీబాల్ ఆడాడు. అనంతరం జాతీయ రహదారిని దాటుతుండగా చేతిలోంచి బాల్ జారిపడింది. దానిని పట్టుకోబోతుండగా ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నరేష్‌ను స్థానిక ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు.

జప్తిశివనూర్‌లో...

జప్తిశివనూర్ జాతీయ రహదారిపై క్రేన్‌ను ఢీకొని ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. నార్సింగి మండలం నర్సంపల్లి పెద్దతండాకు చెందిన నేనావత్ బాషా శనివారం రాత్రి రామాయంపేట నుంచి నార్సింగి వైపు బైక్‌పై వెళ్తున్నాడు. రహదారి పనులు చేస్తున్న క్రేన్‌ను ఢీకొట్టడంతో అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రముఖ పర్యావరణవేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు యువత నడుం బిగించాలని ప్రముఖ పర్యావరణవేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం 'వాతావరణ భద్రత- యువత పాత్ర' అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు పురుషోత్తంరెడ్డితోపాటు సీజీఆర్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి, పర్యావరణ నిపుణుడు దొంతి నర్సింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. యువత పర్యావరణ రక్షణకు నాయకత్వం వహిస్తూ, ప్రభుత్వ విధానాల్లో మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని.. సమాజంలో సుస్థిర అభివృద్ధికి వారధిగా నిలవాలని పిలుపునిచ్చారు. సీజీఆర్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ రక్షణతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములయ్యేందుకు యువత కదిలి రావాలని కోరారు. పర్యావరణ మార్పులు, సుస్థిర అభివృద్ధి తదితర ప్రాధాన్యత అంశాలపై దొంతి నర్సింహారెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీజీఆర్ వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి, ఎర్త్‌సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఐ విజయ్‌భాస్కర్ రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ మాధవరెడ్డి, గౌతమిఫౌండేషన్ అధ్యక్షుడు కృష్ణ, అయిష్టర్ సంస్థ అధ్యక్షుడు సునీల్ శింగాడే, పర్యావరణ ప్రచారకర్త సురేశ్, సామాజిక కార్యకర్త రుచిత్ కమల్, వికాస్, వివిధ కళాశాలల ప్రొఫెసర్లు, ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జిలు, లీప్ ఎడ్యుకేషన్ సెంటర్స్ నిర్వాహకులు, సీజీఆర్ ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

ఓటింగ్‌లో ఆమెదే ఆధిక్యం



- అత్యధికంగా ఓటేసిన మహిళా ఓటర్లు
- మున్సిపాలిటీలో పెరిగిన ఓటింగ్ శాతం

పోలైన ఓట్ల వివరాలు

పోలింగ్ స్టేషన్	మొత్తం ఓటర్లు	పోలైనవి	పురుషులు	స్త్రీలు	ఇతరులు
6	1010	788	413	375	0
7	1010	857	428	429	0
8	994	822	392	430	0
9	973	861	413	448	0
10	1060	940	470	470	0
11	821	700	353	347	0
12	1294	967	483	484	0
13	1227	1007	491	516	0
14	741	554	291	263	0
15	1194	938	508	430	0
16	881	702	379	323	0
17	1442	998	510	487	1
18	986	752	358	394	0
19	1098	899	420	479	0
20	1014	837	405	432	0
21	655	525	244	281	0
22	869	678	318	360	0
23	849	725	356	369	0

హుస్నాబాద్: హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలదే పై చేయిగా నిలిచింది. ఈసారి పురుషుల కంటే వారే అధికంగా ఓటు వేశారు. అయితే ప్రతీ ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు విలక్షణ తీర్పు ఇస్తున్నారు. మున్సిపాలిటీలో ఏ పార్టీకి మెజారిటీ వస్తుందో ఆ పార్టీ గెలుపునకు నాంది పలుకుతుంది. ఈసారి ఇక్కడి ఓటర్లు ఎవరి వైపు నిలిచారో అనేది తెలియాల్సి ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో 2014, 2018 కంటే 2023లో అత్యధికంగా ఓటింగ్ శాతం నమోదైంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో 68.76 శాతం, 2018లో 79.72 శాతం, 2023 ఎన్నికల్లో 80.31 శాతం ఓటింగ్ శాతం నమోదైంది. ప్రతి ఎన్నికల్లో మహిళలదే పై చేయిగా నిలుస్తోంది. మొత్తం ఓటర్లు 18118 కాగా, పోలైన ఓట్లు 14,556, ఇందులో పురుషులు 7232, స్త్రీలు 7317 మంది ఓటు వేశారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 18 బూత్‌లు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా 13వ బూత్‌లో 1227 ఓట్లు ఉన్నాయి. మొత్తం పోలైన ఓట్లు 1007, ఇందులో పురుషులు 491, స్త్రీలు 516 మంది ఓటు హక్కును వినియోగం చేసుకున్నారు. అత్యల్పం 21వ బూత్‌లో 655 ఓట్లు కాగా, 525 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 244 మంది, స్త్రీలు 281 మంది ఓటును సద్వినియోగం చేసుకున్నారు.

పెట్రోల్ కల్తీ చేశారంటూ ఆందోళన

చేర్యాల(సిద్దిపేట): పట్టణ శివారులోని ఓ బంక్‌లో పెట్రోల్ కల్తీ జరిగిందని, దాని కారణంగా తన కారు పాడైందని ఓ వాహనదారుడు శుక్రవారం రాత్రి ఆందోళనకు దిగాడు. బంక్‌లో పెట్రోల్ పోసుకున్న తర్వాత కారు స్టార్ట్ కాలేదు. మెకానిక్‌ను సంప్రదించి కారును షెడ్డుకు తరలించారు. కల్తీ పెట్రోల్ కారణంగానే కారు స్టార్ట్ కాలేదని తెలుసుకున్న వాహనదారుడు బంక్ వద్ద ఆందోళన చేశాడు. దీనిపై బంక్ సిబ్బందిని ప్రశ్నించగా తమకు సంబంధం లేదని దాట వేసినట్లు వాపోయాడు. సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి బంక్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని ఆత్మహత్య

కొడిపల్లి(నర్సాపూర్): సెల్‌ఫోన్ కొనివ్వలేదని మనస్తాపంతో ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొడిపల్లిలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బర్ల సురేష్, అమృత దంపతులకు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు వంశీ(16) కొన్ని రోజులుగా సెల్‌ఫోన్ కొనివ్వాలని తండ్రిని అడుగుతున్నాడు. కాగా ధాన్యం డబ్బు వచ్చాక కొనిస్తానని తల్లిదండ్రులు నచ్చజెప్పారు. శనివారం ఫోన్ కొనివ్వాలని తండ్రితో గొడవపడ్డాడు. అనంతరం తన సైకిల్‌పై కొడిపల్లి సమీపంలోని బండగుట్ట అడవి వద్దకు వెళ్లి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.

మరణంలోనూ వీడని బంధం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అన్నాదమ్ముళ్లు



చిన్యా (ఫైల్)



దేవ్య (ఫైల్)

పాపన్నపేట(మెదక్): రక్తం పంచుకు పుట్టిన అన్నాదమ్ముళ్ల బంధం మరణంలోనూ వీడలేదు. వరి విత్తనాల కొనుగోలు చేయడానికి బయల్దేరిన సోదరులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన సంఘటన పాపన్నపేట శివారులో శనివారం ఉదయం చోటు చేసుకొంది. బాధితులు, ప్రత్యక్ష సాక్షుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టేక్మాల్ మండలం హసన్ మహ్మద్‌పల్లి తండాకు చెందిన కులుసోత్ చిన్యా ఎలియాస్ శ్రీను(50) అతని సోదరుడు కులుసోత్ దేవ్య(46) వరి విత్తనాలు కొనడానికి బైక్‌పై లక్ష్మీనగర్ బయల్దేరారు. పాపన్నపేట శివారులోని బారాఖానాల వద్ద ముందుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న లారీని బైక్‌తో ఢీకొట్టారు. దీంతో ఇద్దరు అన్నదమ్ముళ్లు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్సై మహిపాల్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఆరిన ఇంటి దీపాలు

కులుసోత్ నార్యా, జమున దంపతులకు చిన్యా, రవి, దేవ్య ముగ్గురు సంతానం. మధ్య కొడుకు రవిని 2017లో కొంతమంది కొట్టి చంపారు. మిగిలిన ఇద్దరు రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో ఆ ఇంటి దీపాలు ఆరిపోయాయి. కాగా చిన్యాకు భార్య మీరి, నలుగురు ఆడబిడ్డలు, ఓ కొడుకు ఉన్నాడు. దేవ్యకు భార్య బూలి, కొడుకు రాహుల్ ఉన్నారు. అన్నాదమ్ముళ్ల మరణంతో హసన్ మహ్మద్‌పల్లి తండా కన్నీటి సంద్రంలో మునిగిపోయింది.

బైక్ అదుపు తప్పి.. యువకుడు మృతి



చందు (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): బైక్ అదుప తప్పడంతో కిందపడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని దౌలాపూర్ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామానికి చెందిన చెక్కల చందు(19) తల్లిదండ్రులతో కలిసి శుక్రవారం జగదేవ్‌పూర్ మండలంలోని కొండాపూర్‌లో జరిగే శుభకార్యానికి వచ్చాడు. రాత్రి 8గంటలకు కొండ్రెడి చెరువు గ్రామంలోని తన మిత్రుడి వివాహ బరాత్‌కు హాజరయ్యేందుకు బైక్‌పై బయల్దేరాడు. కాగా దౌలాపూర్ గ్రామం దాటగానే బైక్ అదుపు తప్పి కింద పడడంతో చందు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. శనివారం ఉదయం గ్రామస్తులు గమనించి జగదేవ్‌పూర్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.